# విసుగు చెందని విక్రమార్కుడి కథ

బేతాళుడు ఎంత విసిగించినా విక్రమార్కుడు విసుగు చెందలేదు. ఎన్ని సార్లు జారిపోయినా అన్నిసార్లు పైకి పాకింది సాలీడు. ఎన్నిసార్లు వోడిపోయినా గెలిచేవరకు యుద్ధం చేశాడు-బ్రూసు. ఎందుకు? వాళ్ళంతా ప్రజ్ఞానిధులు కనుక. వాళ్ళకి ఎన్ని విఘ్నాలు కలిగినా వాళ్ళకి ఉత్సాహం ఇనుమడిస్తుందే కాని తగ్గదు. ఒక్కొక్కప్పుడు వడ్డించే మన వాళ్ళకి చాలా సార్లు సగం దూరం వచ్చేసరికి ఎవరో ఒకరు అడ్డం తగుల్తారు. కష్టపడి మన దాకా చేరినా అక్కడ విస్తరుండదు. ఇన్ని కష్టాలున్నా వాళ్ళు మనకి వడ్డించదల్చుకున్నారు కనుక నిరుత్సాహ పడకుండా సమయం కల్సొచ్చే వరకు ఆగి వడ్డించి తీరుతారు. అటువంటి పట్టు విడవని ఫణిక్కర్ కథ ఇది.

పణిక్కర్‌కి స్వతంత్ర రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగం వుంది. ఆయనకి లక్ష్మి అనే గారాబాల కూతురు వుంది. లక్ష్మికి చిన్నప్పుడు దేవానంద్, వహీదా రహమాన్‌ల సినిమాలు, కొంచెం పెద్దప్పుడు రాజేష్‌ఖన్నా, షర్మిలా ఠాగూర్ సినిమాలు చాలా ఇష్టం. అన్ని పుస్తకాల్లోని ప్రేమ కథలు చదువుతుంది. అందాల రాజు కుమారుడికోసం కలలు కనేది. ఇలా ఉండగా పక్కింట్లోకి మంచి విగ్రహ పుష్టున్న అబ్బాయి వచ్చాడు. ఆ అబ్బాయి సినిమాల్లో హీరోలాగా అందంగా ఉంటాడు. అందుకని లక్ష్మి ఆ అబ్బాయి చెల్లెల్తో స్నేహం కట్టి ఆ అబ్బాయి పేరు రమణ్ వల్సాంకర్ అని తెలుసుకుంది. పైగా అతను సివిలింజనీరింగ్ చదువుతున్నట్టు కూడా తెలుసుకుంది. అయితే అప్పటి కింకా ఇంజనీర్ల మీద కార్టూన్లు రావటం లేదు కాని వాళ్ళకి ఉద్యోగాలు వస్తున్నాయి, అందుకని ఎంచక్కా హృదయం పారేసుకుంది. అల్లా లక్ష్మి పారేసుకున్న హృదయం రమణ్‌కి దొరికింది, అది తీసుకు వెళ్ళి 'ఇదుగో మీ హృదయం నాకు దొరికింది' అంటూ మంచి బాలుడులా ఇచ్చేయబోయాడు. ఎవరైనా మనం పారేసుకున్న వస్తువు తెచ్చి ఇస్తే మనం బహుమానం ఇవ్వాలి కదా! అందుకని లక్ష్మి అతను తెచ్చి ఇచ్చిన వస్తువు తిరిగి బహుమానం కింద ఇచ్చేసింది. 'నేను మాత్రం ఉత్తినే బహుమానాలు పుచ్చుకోడం ఎందుకు?' అని రమణ్ ఆలోచించి తన హృదయాన్ని లక్ష్మికి బహుమానంగా ఇచ్చేశాడు. లక్ష్మి అది ఆనందంగా అందుకుంది.

ఈ ఇచ్చిపుచ్చుకోడాలు నచ్చని వ్యక్తి ఫణికర్. 'అతన్ది అతని కిచ్చేసి నీది నువ్వు తెచ్చుకో' అని కూతురుకి చెప్పి చూశాడు, లక్ష్మి చేతిలో తాయిలం ఎవరైనా లాక్కుంటే చిన్న పిల్లలు చేసినంత గొడవ చేసింది. ఆఖరికి ఫణిక్కర్ గారాబాల కూతురు పట్టుదలకి లొంగాల్సి వచ్చింది. అయితే ఫణిక్కర్‌కి పెద్ద ఉద్యోగస్థుడికి తప్ప తన కూతుర్నివ్వటం ఇష్టం లేదు. లక్ష్మి రమణ్‌ని తప్ప ఇంకెవర్ని పెళ్ళి చేసుకోడం ఇష్టం లేదు. ఫణిక్కర్‌కి లెక్కలు వచ్చు. అందుకని ఈ సైమల్టేనియస్ ఈక్వేషన్సుకి ఒకటే సొల్యూషన్ అని అది రమణ్ పెద్ద ఉద్యోగస్థుడవడం అని పోల్చుకున్నాడు, ఉత్త బియ్యీతో పెద్ద ఉద్యోగం కష్టం కనుక అతని పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళి తను చల్ల కోసం వచ్చినట్టు చెప్పి ముంత పైన పెట్టాడు. రమణ్ విదేశాలు వెళ్ళి వస్తే మంచి వుద్యోగాలు వస్తాయని చెప్పాడు. వాళ్లు కోరగా ఫణిక్కర్ నడుము కట్టుకుని రమణ్‌ని ఏదో గవర్నమెంటు స్కాలర్‌షిప్‌లో పై దేశాలకి తోలేశాడు. అయితే రమణ్ బుర్ర గట్టిది. అందులోకి ఏదీ చప్పున ప్రవేశించలేదు. అందరు ఏడాది తీసుకునే దానికి మూడేళ్ళు తీసుకుని తిరిగి వచ్చాడు.

అయితే రమణ్ తిరిగొచ్చేసరికి పరిస్థితులు విషమించాయి. ఇంజనీర్ల మీద అప్పటికే ఒకటి రెండు కార్టూన్లు వచ్చాయి. పైగా అంతకు ముందు పై దేశాలకి వెళ్ళినవాళ్ళు పిహెచ్.డి.లు తీసకు వచ్చారు. ఇండియాలో ఉన్నవాళ్ళు కూడా కాలక్షేపానికి పిహెచ్.డిలు చేశారు. అందుకని రమణ్‌కి వుద్యోగం విషయంలో చాలా మంది శక్తి సంపన్నులైన పోటీదారు లేర్పడ్డారు. అందుచేత ఏవో రెండు ఇంటర్వ్యూలకి వెళ్ళి రమణ్ పరాజయం పొందాడు. ఏం చేయాలా అని ఫణికర్ బుర్ర పాడుచేసుకోవడం మొదలు పెట్టాడు. ఒక రోజు అర్జెంటుగా ఆఫీసుకు వెళ్తూ చొక్కాకి గుండీలు తెగిపోయినట్టు గుర్తించాడు. అప్పుడు 'అమ్మాయి లక్ష్మీ! చొక్కాకి గుండీలు కుట్టు' అన్నాడు. ఆ అమ్మాయి సూదిలో దారం ఎక్కించటానికి నానా తిప్పలూ పడి అయిదోసారి ఎక్కించ గలిగింది. అప్పుడు ఫణిక్కర్‌కి జ్ఞానోదయం కలిగింది. పట్టు విడవకుండా ఏ పనైనా చేస్తే విజయం తథ్యం అని గుర్తింపు కల్గింది. చిన్నప్పుడు చదువుకున్న బ్రూసు-సాలీడు కథ గుర్తు కొచ్చింది.

ఇల్లా వుంటుండగా సివిలింజినీరింగ్ ఉద్యోగం ఒకటి ఖాళీ అయింది. కేంద్ర ప్రభుత్వం తరపున దరఖాస్తులు కోరుతూ ఫణిక్కర్ ప్రకటనిచ్చాడు - రమణ్ చేత దరఖాస్తు పెట్టించాడు. అయితే అడుగులోనే హంస పాదులాగా అప్లై చేసి వాళ్ళలో సుబ్బారావనే పిహెచ్.డి. కుర్రాడు కూడా ఉన్నాడు. అయితే రమణ్ కున్నది విదేశీ డిగ్రీ కనుక ఈ అవాంతరాన్ని సులభంగానే దాటవచ్చునని ఫణిక్కర్ అనుకున్నాడు, సెలక్షన్ బోర్డులో వాడేక్కర్, దండేక్కర్‌లను వేసుకున్నాడు. అయితే వాడేక్కర్‌కి చిన్నప్పటినుంచి ఆదర్శాలు గట్రా అంటే ఇష్టం. లాలూచీలూ, అభిమానాలూ అంటే కిట్టవు. మామూలుగా అయితే వాడేక్కర్ లాంటి దుష్టుల్ని కిందే వుంచేద్దురు, కాని అతగాడు కిందే వుంటే అతడి కిందవాళ్ళకి ప్రమోషన్లు రాని పరిస్థితుల్లో అతనికి ప్రమోషనిచ్చి ముందుకు నెట్టేశారు. అంటే అతడ్ని పక్కన పెట్టడానికి ప్రయత్నాలు జరగకాదు. కాని కోర్టు వారు ఆ ప్రయత్నాలు సాగనీయలేదు. ఇంటర్ వ్యూలకి ముందర

ఇండియన్ పిహెచ్.డి కంటే విదేశీ మాస్టర్స్ డిగ్రీ గొప్పదని ఫణిక్కర్., కాదని వాడేక్కర్ వాదించాడు. వాడేక్కర్ అడిగి ప్రశ్నలవల్ల రమణ్‌కి సుబ్బారావుకి గల భేదం దండేక్కర్‌కి తెలిసి పోయి అతనూ వాడేక్కర్ పక్షమే వాదించాడు. వీళ్ళ విషయం ముందరే తెలిసుంటే ఫణిక్కర్ వీళ్ళని సెలక్షన్ బోర్డులోనికి తీసుకోకపోను. కాని అప్పటికే చేతులు కాలాయి. ఏకాభిప్రాయం కుదరనందువల్ల ఖాళీ భర్తీ చేయ్యక పోడానికి తమకుగల హక్కును సెలక్షన్ బోర్డు వాడుకుంది.

ఒకసారి సెలక్షన్ బోర్డుంటూ ఏర్పరిచాక అందులోని మెంబర్లు మన కిబ్బందిగా వున్నారు కదా అని వాళ్ళని తీసేసి మరొకళ్ళను వేసుకోడానికి వీల్లేదు కదా! అందుకని ఫణిక్కర్ రెండోసారి కాస్త జాగ్రత్త పడ్డాడు. ఇంకో వుద్యోగం మరో రెండు నెలల్లో ఖాళీ అవుతోందని తెలిసి అంతవరకు ఆగి అప్పుడు రెండు వుద్యోగాలకి కలిపి ప్రకటన చేశాడు. ఈసారి ఒకటి సుబ్బారావుకిస్తే రెండోది రమణ్ కివ్వడానికి వాడేక్కర్‌కి అభ్యంతరముండదు కదా అని ఫణిక్కర్ అనుకున్నాడు. కాని ఈసారి ఫారిన్‌లో పిహెచ్.డి. చేసి, ఖొరానో అనే సివిలింజినీరింగ్ పిల్లాడు ఇండియా వచ్చాడు. వచ్చి ఊరుకోకుండా ఈ వుద్యోగాల ప్రకటన చూసి దరఖాస్తు పెట్టాడు.

ఇంటర్వ్యూనాడు ఫణిక్కర్ మేకపోతు గాంభీర్యంతో వాడేక్కర్‌ని చూసి 'ఈ సారి నీకు, నాకు పేచీ లేదు. ఒక వుద్యోగం రమణ్‌కి, మరోటి సుబ్బారావుకి' అన్నాడు 'లేకపోడమేమిటి, అదల్లాగే వుంది. ఖొరానా ఫారిన్ పిహెచ్.డి' అన్నాడు వాడేక్కర్. 'పోనీ సుబ్బారావుకి మానేసి ఖొరానాకి ఇద్దాం' అని రాజీకొచ్చాడు ఫణిక్కర్. 'నేనన్నది అదికాదు. ఒకటి సుబ్బారావుకి, మరోటి ఖొరానాకి' అని తను కూర్చున్న కుర్చీకి మూడే కాళ్ళు' అని వాదించాడు వాడేక్కర్. దాని ఫలితంగా రమణ్‌ని తన ప్రశ్నలతో వాడేక్కర్ వుక్కిరి బిక్కిరి చేస్తే, ఫణిక్కర్ సుబ్బారావుని, ఖొరానాని తన ప్రశ్నలతో తికమక పెట్టాడు. దండేక్కర్ చూస్తూ ఊరుకున్నాడు. సెలక్షన్ బోర్డువారు తమ హక్కుని మరోసారి వాడుకుని ఉద్యోగాలు నింపలేదు.

మూడోసారి ఫణిక్కర్ చాలా కష్టపడి ఫైలంతా స్టడీ చేశాడు. అప్పుడతనికి అర్థమైం దేమిటంటే సుబ్బారావుది నీటి సారుదల (హైడ్రాలిక్స్) అయితే, ఖొరానాది (కట్టడాలు - స్ట్రక్చర్స్), రమణ్‌ది ప్రజారోగ్యం (పబ్లిక్ హెల్తు) అనీను, అల్లా అర్థమయ్యాక వో అర్ధరోజు ఆలోచించాడు ఆపైన వో ఉద్యోగాన్ని నీటి కట్టడానికి (హైడ్రాలిక్ స్ట్రక్చర్స్) మరోటి ప్రజారోగ్యానికి కేటాయిస్తే పోలా అనుకున్నాడు. పోయేది సుబ్బారావుగాని, ఖొరానాగాని. అల్లా కేటాయించి ప్రకటన ఇచ్చాడు. ఇంటర్వ్యూనాడు నీటి కట్టడాలకి పొద్దున్న, ప్రజారోగ్యంకి మధ్యాహనం కేటాయించాడు. ఆరోజు పొద్దున్న, వాడేక్కర్ సుబ్బారావుని బలపరుస్తే, ఫణిక్కర్ కూడా సుబ్బారావునే బలపర్చాడు. దండేక్కర్ అడ్డుపెట్టలేదు. సుబ్బారావుకి వుద్యోగం వచ్చింది.

సుబ్బారావు వుద్యోగం విషయంలో ఏకాభిప్రాయం కుదిరాక, మధ్యాహ్నం వాడేక్కర్‌ని చూస్తూనే ఫణిక్కర్ స్నేహ పూర్వకంగా నవ్వాడు. నవ్వితే పోయేదేముందని వాడేక్కర్ కూడా నవ్వాడు, కాని ఇంటర్వ్యూలో తన ప్రశ్నలతో రమణ్‌ని తుక్కు రేకొట్టాడు. ఫణిక్కర్ కిది

నచ్చలేదు. కాని మనిషి ననవసరంగా రెచ్చ కొట్టడం ఇష్టంలేక వూరుకున్నాడు. కేండి డేట్లందరూ అయ్యాక వచ్చినవాళ్ళలో రమణ్ నయం కనుక రమణ్‌ని తీసుకుందామని ఫణిక్కర్ అన్నాడు. ఆ మాట నిజమే అయినా, ఒక రెండు నెల లాగితే ఇంకా మంచివాళ్ళు రావచ్చునని ఆ వుద్యోగానికి రమణ్ తగడని వాడేక్కర్ అన్నాడు. దండేక్కర్ అతన్తో ఏకీభవించాడు. బహుశహ ఫణిక్కర్ తనకి రమణ్‌లో వున్న ఇంటరెస్టు ఏమిటో చేప్తే అవతలిద్దరు సరేనందురేమో కాని ఫణిక్కర్ మెరిట్ వాదం చేశాడు. అదయ్యాక అందరు ఒకే రాష్ట్రం వారై వుండి రమణ్‌కి వుద్యోగం రాకపోటం అన్యాయం అని ప్రాంతీయ వాదం చేశాడు. మిగిలిన ఇద్దరు కేంద్ర ప్రభుత్వ వుద్యోగాలలో ప్రాంతీయ భావాలకి తావు లేదన్నారు. సెలక్షన్ బోర్డు ఖాళీని నింపకపోడానికి నిశ్చయించుకుంది.

ఇల్లా వుంటూవుండగా ఈ పరిశీలనార్ధం, ఆ పరిశీలనార్ధం అంటూ కేంద్ర ప్రభుత్వం విదేశాలు పంపించే ముఠాల్లో వాడేక్కర్‌ని ఫణిక్కర్ మూడు నెలల పాటు తన పలుకుబడినంతా వినియోగించి తోలేశాడు. ఆలస్యం లేకుండా వెంటనే ప్రకటనిచ్చేసి తనకి రమ్ మరియు రమ్మీ స్నేహితుడైన పల్నీట్క్కర్‌ని సెలక్షన్ బోర్డులో వేసుకున్నాడు. వెంటనే ఇంటర్‌వ్యూ ఏర్పాటుచేశాడు. ఈసారి పొంచివున్న ప్రమాదం దండేక్కర్ రూపంలో బయట పడింది. అతను 'కిందటిసారి రమణ్‌ని వద్దనుకున్నాము కదా! ఇప్పుడు కావాలనుకోడం ఏం బావుంటుంది? బావుండదు వద్దు' అన్నాడు. 'చాలా బాగుంటుంది కిందటిసారి చేసిన తప్పు మళ్ళీ చేయడం బావుండదు కాని సరిదిద్దుకోడం చాలా బాగుంటుంది' అన్నారు మిగిలిన ఇద్దరు, మాట మాట వచ్చి సెలక్షన్ బోర్డువారు తమ హక్కును మరోసారి వాడుకున్నారు.

అయిదోసారి విసుగు చెందని విక్రమార్కుడు తన ప్రయత్నం మొదలు పెట్టాడు. అయితే ఈసారి ఏ విధమైన రిస్కు తీసుకోదల్చు కోలేదు. ఇంటర్‌వ్యూ డేటు నిర్ణయించి, ఆరోజే దండేక్కర్‌కి లెటర్ టైపు చేయించినా అది ఇంకా ఇంటర్‌వ్యూకి రెండు రోజులుందనే వరకు పోస్టు చేయించలేదు. ఫణిక్కర్, ఆ ఉత్తరం అంది దండేక్కర్ ఇంటర్‌వ్యూకి రాదల్చుకున్నా ఇంటర్‌వ్యూ టైముకి రాలేడు. అది ఫణిక్కర్ పన్నాగం అయితే, దండేకర్ మొండి ఘటం కనుక తను ఇంటర్‌వ్యూనాడు మధ్యాహ్నం విమానంలో వస్తున్నట్టు, అందుకని కొద్ది గంటల పాటు ఇంటర్‌వ్యూని పోస్టుపోన్ చేయ్యదల్చుకుందిగా టెలిగ్రామ్ ఇచ్చాడు. ఫణిక్కర్ అటువంటి తెలివి తక్కువ పని ఏమీ చెయ్యదల్చుకోలేదు. అందుకని ఆ టెలిగ్రామ్ అందుకున్న గుమస్తాని పిల్చి 'నువ్వెన్ని రోజుల బట్టో మీ అత్తగారి వూరు వెళ్దామను కుంటున్నావు కదా! ఇవాళ వెళ్ళు' అన్నాడు. తన దగ్గర డబ్బులేదన్నాడు గుమస్తా. అప్పుడు ఫణిక్కర్ 'ఈ డబ్బు ఉంచుకో' అంటూ కొంత డబ్బు చేతిలో పెట్టాడు. ఆ మర్నాడు అనుకున్న విధంగా పొద్దున్నే ఇంటర్‌వ్యూలు జరిపి మూడో సభ్యుడైన దండేక్కర్ రానందుకు రెండు నిమిషాలు అఫీషియల్‌గా చింతించి, ఆపైన ఆ వుద్యోగం రమణ్‌కి కట్టబెట్టాడు. టెలిగ్రామ్ విషయం ఆఖరికి పల్నీట్క్కర్‌కి కూడా తెలియదు. తెలిసిన గుమస్తా ఊళ్ళో లేడు. దండేక్కర్ మధ్యాహ్నం రాగానే 'మీ రొస్తున్నట్టు తెలిస్తే ఇంటర్‌వ్యూ కాస్సేపాపుదునే. విమానాశ్రయానికి కారు పంపుదునే' అంటూ

ఫణిక్కర్ చింతించాడు. దండేక్కర్ ఆశ్చర్య పోతూ తను టెలిగ్రామ్ యిచ్చిన విషయం చెప్పాడు. అప్పుడు ఫణిక్కర్ నానా హంగామాచేసి దాన్ని గుమస్తా డ్రాయర్లలోంచి బయటికి తీసి దండేక్కర్‌కి క్షమాపణ చెప్పుకున్నాడు. చేసేది లేక తను గూడా ఆ నిర్ణయంతో ఏకీభవిస్తున్నట్టు సంతకం పెట్టి, టి.ఏ. తీసుకున్నాడు దండేక్కర్. దండేక్కర్ తల్లితండ్రుల దావూరే. ఇంటర్‌వ్యూ పేరు చెప్పుకుని ఇప్పటి కైదుసార్లు వచ్చాడు. ఆ రోజుతో ఆ అవకాశం పోయినందుకు దండేక్కర్ బాధ పడ్డాడు.

ఈ కథలో పట్టు విడవని సాలీడు ఫణిక్కర్ అయితే తెగిపోని దారం రమణ్. దారం తెగి వుంటే సాలీడు ఏం చేయును? విసుగు చెందని విక్రమార్కుడు ఫణిక్కర్ అయితే అన్నిసార్లు వోపిగ్గా మోయించుకున్న ప్రేతం రమణ్. అంటే ఏమిటంటే మధ్యలో రమణ్‌కి విసుగొచ్చి మానేస్తే ఫణిక్కర్ ఏం చేయగల్గును? అందుచేత ఫణిక్కర్ ఎంత గొప్పవాడో, రమణ్ అంత గొప్పవాడు. ఆ విషయం గుర్తించి ఫణిక్కర్ వో ఆర్నెల్లు పోయాక కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. లక్ష్మి అనుకున్న పని సాధించింది. ఈ కథలో ప్రారబ్ధార్థము నుజ్జగింపని ప్రజ్ఞానిధుల్ - లక్ష్మి, ఫణిక్కర్, రమణ్‌లు. విఘ్నాలతో విసుగెత్తి మధ్యలో పట్టు వదిలేసిన వ్యక్తులు వాడేక్కర్ మరియు దండేక్కర్. వాడేక్కర్‌ని గూడా ఈ కోవలో ఎందుకు వేయాల్సొచ్చిందంటే, అతడు నిజమైన ధీరుడైతే పై దేశాలకి పోకుండా ఈ విషయం అంతు తేల్చి వుండాల్సింది. అతడు కూడా ఇందులోంచి ఏదన్నా సాకు దొరికితే తప్పుకుందామని అనుకునుండాలి.

*-ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 71*

★